sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 17-08-2026 సోమవారం | సంపుటి-02 సంచిక : 130 EDITOR: ROHINI



సిగ్గుమాలిన ఎన్టీఏ... విద్యార్థులను ముంచే

నిన్న నీట్... నేడు నెట్.... తీరుమారని దరిద్రం

- కీలకమైన నెట్ ప్రశ్నలన్నీ తప్పులు తడకే
- 2024 ఇంగ్లీష్ పేపర్ నుంచి సగం ప్రశ్నలు
- ఎన్టీఏ నిర్వాకం... మూడు పరీక్షల రద్దు
- మళ్లీ పరీక్షలకు ఏర్పాట్లు చేసిన అధికారులు

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షల్లో భారీగా తప్పులు దొర్లాయి. ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ పేపర్లలో అక్షర దోషాలు, పాత ప్రశ్నల పునరావృతం తీవ్ర కలకలం రేపాయి. దీంతో ఏడు వారాల నిరీక్షణ తర్వాత ఆ మూడు సబ్జెక్టుల పరీక్షలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అభ్యర్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చిన ఈ భారీ వైఫల్యంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- సహనం వందే, న్యూఢిల్లీ

గత మూడు నెలలుగా దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన నీట్ పరీక్షల లీక్ వ్యవహారం... విద్యార్థుల ఉద్యమాలు... కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా... ఇలాంటి ఘటనలతో దేశం వణుకుతుంటే ఎన్టీఏ తీరును ఏమాత్రం మార్చుకోవడం లేదు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే అత్యంత కీలకమైన యూజీసీ నెట్ పరీక్షల నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యం బయటపడింది. జూన్ నెలలో జరిగిన ఈ పరీక్షకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ప్రావిజనల్ ఆన్సర్ కీలలో తీవ్రమైన గోల్‌మాల్ వెలుగు చూసింది. మొత్తం 87 సబ్జెక్టులకు గాను 84 సబ్జెక్టుల కీలను విడుదల చేసిన అధికారులు, ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టుల కీలను మాత్రం నిలిపివేశారు. ఈ మూడు సబ్జెక్టుల ప్రశ్నపత్రాలలో తీవ్రమైన తప్పులు ఉన్నట్లు గుర్తించడంతో పరీక్షల నిర్వహణపై పెద్ద ఎత్తున విమర్శలు చెలరేగాయి. విద్యార్థుల నుంచి వస్తున్న తీవ్రమైన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

పరీక్షా పేపర్ తప్పుల తడక...

సోషియాలజీ పరీక్షా పేపర్‌లో దొర్లిన తప్పులు చూస్తే ఎన్టీఏ పనితీరు ఏ స్థాయిలో ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. పేపర్‌లో ప్రముఖ సామాజిక శాస్త్రవేత్తల పేర్లే పూర్తిగా తప్పుగా ముద్రితమయ్యాయి. రిట్జర్ పేరు పుట్జర్ గాను, పార్సన్స్ పేరు పార్సో గాను, ఘుర్యే పేరు ఘున్యే గాను, ఏఆర్ దేశాయ్ పేరు ఏకే దేశాయ్ గాను తప్పుగా వచ్చాయి. దీనికి తోడు పుస్తకాల పేర్లు గందరగోళంగా ఉండటం, వ్యాకరణ, పంక్చుయేషన్ తప్పులు దొర్లడం, ప్రాథమిక సిలబస్‌తో సంబంధం లేని ప్రశ్నలు ఇవ్వడం జరిగాయి.

ఇంగ్లీష్ పేపర్‌లో పాత ప్రశ్నల దండయాత్ర

ఇంగ్లీష్ సబ్జెక్ట్ పరీక్షా పేపర్‌లో ఏకంగా కాపీ పేస్ట్ దందాలు బయటపడ్డాయి. 2024 సంవత్సరంలో జరిగిన పరీక్షలో అడిగిన 150 ప్రశ్నలలో ఏకంగా 67 ప్రశ్నలు ఈసారి జరిగిన పరీక్షలో అచ్చం అలాగే పునరావృతమయ్యాయి. కనీసం ఆప్షన్ల క్రమం కూడా మార్చకుండా యథాతథంగా దింపేయడం అధికారులు ఎంత బాధ్యతారహితంగా వ్యవహరించారో తేటతెల్లం చేస్తోంది. ఇదే తరహాలో కామర్స్ పేపర్‌లో కూడా ప్రశ్నలు రిపీట్ కావడం పట్ల అభ్యర్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగుల భవితవ్యాన్ని నిర్ణయించే జాతీయ స్థాయి పరీక్షలలో ఈ స్థాయి కాపీ కొడుతుండటం విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపుతోంది.

సమస్య పరిష్కారానికి కమిటీ మొండిచేయి

వచ్చిన ఫిర్యాదుల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ఎన్టీఏ అవకతవకలను బట్టబయలు చేసింది. సాధారణంగా ఆన్సర్ కీ ప్రక్రియలో తప్పు ప్రశ్నలను తొలగించి మార్కులు కలపడం జరుగుతుంది. కానీ ఈ పేపర్లలోని లోపాలు ఆ స్థాయిని మించిపోయాయని కమిటీ తేల్చింది. ఫ్యాక్చువల్, టైపోగ్రాఫికల్, ట్రాన్స్‌లేషన్ తప్పులతో పాటు ప్రాథమిక ప్రమాణాలు కూడా గాలికి కొట్టుకుపోయినట్లు కమిటీ గుర్తించింది. ప్రశ్నలను తొలగించడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, పేపర్ ప్రమాణాలు పూర్తిగా దెబ్బతిన్నాయని తేలడంతో రీటెస్ట్ నిర్వహణే ఏకైక మార్గంగా ఎన్టీఏ అంగీకరించింది. ఈ మూడు సబ్జెక్టుల పరీక్షలను సెప్టెంబర్ 9 మరియు సెప్టెంబర్ 10 తేదీలలో మళ్లీ నిర్వహించనున్నట్లు ఎన్టీఏ షెడ్యూల్ ప్రకటించింది.



గడ్డి తింటున్న హీరోలు

షారుఖ్, అజయ్, టైగర్ ప్రాఫ్‌ల లీలలు

- విమల్ ప్రచారంలో హాలీవుడ్ హీరోలు
- ఉక్కు పాదం మోపిన మహారాష్ట్ర ఎఫ్‌డీఏ
- వివరణ ఇవ్వాలని నటులకు నోటీసులు జారీ
- వెండితెర హీరోలు... నిజ జీవితంలో విలన్లు

తెరపై దేశాన్ని రక్షించే ధీరులు నిజ జీవితంలో మాత్రం ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నారు. కోట్ల రూపాయల రెమ్యునరేషన్ కోసం హానికరమైన పాన్ మసాలా ఉత్పత్తులకు పరోక్ష ప్రచారం చేస్తూ దొరికిపోయారు. విమల్ ప్రకటనలో నటించిన షారుఖ్ ఖాన్, అజయ్ దేవగన్, టైగర్ ప్రాఫ్‌లకు మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటీసులు ఇప్పుడు సినీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

- సహనం వందే, మహారాష్ట్ర

సినిమా తెరపై మన నటులు కోట్లు కుమ్మరిస్తున్నారు. వారు బయటకు ఎంత స్టైలిష్‌గా కనిపించినా లోపల అసలు నాటకం వేరే ఉంది. గుట్కా వాసనలతో నిండిన ప్రకటనల్లో నటిస్తూ వీరు సమాజానికి చెడు సందేశం ఇస్తున్నారు. ఈ తీరుపై అధికారులు ఇప్పుడు కఠినంగా వ్యవహరిస్తున్నారు. విమల్ ప్రకటనల వెనుక ఉన్న అసలు వ్యాపారాన్ని తేల్చేందుకు రంగంలోకి దిగారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న హీరోల వైఖరిపై చట్టం తన ఉక్కుపాదం మోపడానికి సిద్ధమైంది.

సరోగ్రఫీ ముసుగులో విక్రయాలు

ఈ ప్రకటనలో కేవలం ఇలాచీ సంబంధిత ఉత్పత్తులు అమ్ముతున్నట్లు చూపిస్తున్నారు. కానీ దీని వెనుక అసలు రూపం వేరే ఉందనేది అధికారుల ప్రధాన ఆరోపణ. మహారాష్ట్రలో పాన్ మసాలా, గుట్కా విక్రయాలపై పూర్తిగా నిషేధం ఉంది. చట్టపరమైన లొసుగులను అడ్డుపెట్టుకుని ఇలాంటి పరోక్ష ప్రకటనలు చేస్తున్నారు. బ్రాండ్ పేరును ప్రజల మెదళ్లలో నాటడమే ఈ సరోగ్రఫీ అడ్వర్టైజింగ్ ముఖ్య ఉద్దేశం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 ప్రకారం ఏ రూపంలో ప్రచారం చేసినా అది నేరమే అవుతుంది.

పదిహేను రోజుల గడువు

మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ముగ్గురు స్టార్ హీరోలకు అధికారికంగా షోకాజ్ నోటీసులు పంపారు. వారు రాబోయే 15 రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రకటనలతో వారికి ఉన్న సంబంధంపై పూర్తి వివరాలు కోరారు. ఒకవేళ నటులు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీఏ స్పష్టం చేసింది. డబ్బుల కోసం ఇలాంటి వస్తువులను ప్రమోట్ చేయడంపై మేధావులు మండిపడుతున్నారు.

ప్రాణాలతో చెలగాటం

కోట్లాది మంది అభిమానులు ఉన్న ఈ నటులకు నైతిక బాధ్యత ఉండాలి. డబ్బు కోసం యువతను పెడదోవ పట్టిస్తే భావితరాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. ఇప్పటికే ఎంతోమంది యువకులు ఇలాంటి అలవాట్ల వల్ల ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడుతున్నారు. అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కొన్ని రోజుల క్రితం సీనియర్ నటుడు సన్నీ డియోల్ కూడా వీటిపై విమర్శలు చేశారు. డబ్బు కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని ఆయన చెప్పిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

సెలబ్రిటీల సైలెంట్ పాత్ర

ప్రస్తుతం ఈ వివాదంపై షారుఖ్ ఖాన్, అజయ్ దేవగన్, టైగర్ ప్రాఫ్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. గతంలో ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు వారు ఏదో ఒక సాకుతో తప్పించుకున్నారు. కానీ ఈసారి నేరుగా ప్రభుత్వ యంత్రాంగమే నోటీసులు జారీ చేసింది. దీంతో వారు ఈ నోటీసులకు ఎలాంటి సమాధానం చెబుతారనేది ఆసక్తికరంగా మారింది. అభిమానులు తమ హీరోలను దేవుడిలా కొలుస్తారు. అందుకే హీరోలు కమర్షియల్ ప్రయోజనాలే కాకుండా సామాజిక బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలి.

చట్టం ముందు అందరూ సమానులే

లక్షలాది మంది ప్రాణాలతో చెలగాటమాడే ఏ వ్యాపారానికైనా, దాన్ని ప్రమోట్ చేసేవారికైనా మూల్యం తప్పదు. ఈ కేసులో మహారాష్ట్ర ఎఫ్‌డీఏ తీసుకోబోయే చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలి.

విదేశస్థులను పెళ్లాడితే ఉద్యోగం ఊస్ట్

కమ్యూనిస్ట్ చైనాలో కఠినమైన నిబంధనలు

- ఉద్యోగుల విదేశీ పర్యటనలపై ఉక్కుపాదం
- విడాకులపై నిఘా... సైనిక ఆంక్షలు
- అక్రమ సంబంధాలుంటే పార్టీ నుంచి గెంటివేత
- ఎవరికైనా ఫస్ట్ పార్టీ... ఆ తర్వాతే కుటుంబం

చైనాలో ప్రేమించడం, పెళ్లి చేసుకోవడం ఇప్పుడు ఒక పెద్ద నేరంగా మారింది. కమ్యూనిస్ట్ పార్టీ సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ వ్యక్తిగత జీవితాలను పూర్తిగా వదులుకోవాల్సి వస్తోంది. అధ్యక్షుడు జిన్‌పింగ్ తెచ్చిన కఠినమైన ఆంక్షలతో కోట్లాది మంది సామాన్య ప్రజలు నరకం చూస్తున్నారు. - సహనం వందే, చైనా

చైనాలో సివిల్ సర్వెంట్లు లేదా కీలకమైన రక్షణ రహస్యాలు తెలిసిన వారు ఎవరూ విదేశీయులను వివాహం చేసుకోకూడదనే కఠినమైన నిబంధన అమల్లో ఉంది. ఒక విదేశీయుడిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలని భావించిన ఒక మహిళా ఉద్యోగికి ఆమె సహోద్యోగులు పెద్ద షాకే ఇచ్చారు. ప్రేమ కావాలా లేక ఉద్యోగం కావాలా అని అధికారులు ఆమెను హెచ్చరించారు. చైనాలో అధికారం ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా పార్టీ సభ్యుడే అయి ఉంటారు కాబట్టి పార్టీ నుంచి బయటికి గెంటేస్తే రాజకీయ జీవితం పూర్తిగా ముగిసిపోతుంది.

విదేశీ పర్యటనలపై ఉక్కుపాదం

చైనాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు విదేశీ పర్యటనలకు వెళ్లాలంటే అనేక అడ్డంకులను ఎదుర్కొవాల్సి వస్తుంది. ఒక రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి తన కుమారుడి యూరప్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి హాజరుకావడానికి ఆరు నెలల ముందే దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు అనుమతించలేదు. ఉద్యోగులంతా తమ పాస్‌పోర్టులను ప్రభుత్వానికి అప్పగించి, ముందస్తు అనుమతి పొందిన తర్వాతే వాటిని తీసుకోవాలని కొత్త నిబంధనలు చెబుతున్నాయి. ప్రయాణ వివరాలను అధికారులకు ముందే స్పష్టంగా తెలపాలి. డైరెక్టర్ జనరల్ స్థాయికి చేరుకున్న అధికారులైతే రిటైర్మెంట్ తర్వాత కూడా విదేశాలకు వెళ్లే స్వేచ్ఛను పూర్తిగా కోల్పోతారు. అలాగే విదేశాలలో కుటుంబ సభ్యులు ఉన్న అధికారులకు పదోన్నతులు లభించవు.

విడాకులపై నిఘా... సైనిక ఆంక్షలు

చైనాలో కేవలం ప్రయాణాలు మాత్రమే కాకుండా విడాకుల ప్రక్రియ కూడా తీవ్రమైన అంశమే. ఒక సీనియర్ అధికారి తనపై విచారణ జరుగుతుందని తెలిసి వెంటనే భార్యకు విడాకులు ఇచ్చి అక్రమంగా సంపాదించిన ఆస్తులను ఆమెకు బదిలీ చేయడానికి ప్రయత్నించాడు. ఇలాంటి మోసాలను అడ్డుకోవడానికి వివాహ స్థితిలో ఏ చిన్న మార్పు వచ్చినా అధికారులు వెంటనే నిఘా పెడతారు. ఇక పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ సైనికుల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. సైనికులు వివాహం చేసుకునే ముందు తమ భాగస్వామికి సంబంధించిన పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ వివరాలు సమర్పించాలి. ఒకవేళ సైనికులు విడాకులు తీసుకోవాలనుకుంటే ఆర్మీ అనుమతి తప్పనిసరి.

అక్రమ సంబంధాలపై ఆంక్షల కత్తి...

చైనా కమ్యూనిస్ట్ పార్టీలో అక్రమ సంబంధాలకు పాల్పడితే వారి రాజకీయ జీవితం క్షణాల్లో ముగిసిపోతుంది. పార్టీ నియమావళి ప్రకారం అక్రమ సంబంధాలు కలిగి ఉంటే వారిని తక్షణమే బహిష్కరిస్తారని సెంట్రల్ పార్టీ హెచ్చరిస్తోంది. కేవలం ప్రేమ వ్యవహారాలే కాకుండా కార్యాలయంలోని సహోద్యోగుల మధ్య సాధారణ స్నేహాలు కూడా అనుమానాలకు తావు ఇస్తున్నాయి. సహోద్యోగులు ఎవరూ కలిసి గ్రూప్ డిన్నర్లకు వెళ్లకూడదనే నిబంధన ఉంది. సహోద్యోగుల మధ్య ఎలాంటి అనధికారిక బంధాలు ఏర్పడకుండా చూసేందుకు అధ్యక్షుడు జిన్‌పింగ్ ఈ కఠినమైన ఆంక్షలను అమలు చేస్తున్నారు.

అత్యున్నత స్థాయి ప్రక్షాళన

చైనా కమ్యూనిస్ట్ పార్టీ 1921లో కొద్దిమంది మేధావులతో ప్రారంభమై నేడు 10 కోట్ల మందికి పైగా సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగింది. 2017లో జిన్‌పింగ్ ప్రభుత్వం, సైన్యం, సమాజం, పాఠశాలలు ఇలా అన్ని రంగాలను పార్టీయే శాసిస్తుందని కొత్త నిబంధనను పార్టీ చార్టర్‌లో చేర్చారు. సీఐఏ మాజీ చైనా అనలిస్ట్ జోనాథన్ సిజిన్ మాట్లాడుతూ జిన్‌పింగ్ పార్టీని ఒక అత్యున్నత నైతిక విలువలతో కూడిన వ్యవస్థగా తీర్చిదిద్దాలని చూస్తున్నారని తెలిపారు. అవినీతి ఆరోపణలపై లి షాంగ్‌ఫుకు మరణశిక్ష విధించారు. అలాగే 24 మంది సభ్యులున్న అత్యంత శక్తివంతమైన పొలిట్ బ్యూరోలో ప్రస్తుతం కేవలం 21 మంది మాత్రమే మిగిలారు. ఈ కఠినమైన వాతావరణంలో ప్రతి పార్టీ సభ్యుడు ప్రతి నిమిషం నిబంధనలకు లోబడి ప్రవర్తించాలని ప్రభుత్వం గట్టిగా కోరుకుంటోంది.